## 'ఆరంతస్తుల' భవన యజమాని అరెస్టు

**ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో 14 రోజుల రిమాండ్**

భద్రాచలం, మార్చి 30: భద్రాచలం పట్టణంలో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌ను పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. అనుమతులు లేకుండా ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తుండగా ఈ నెల 26న అది కుప్పకూలి ఇద్దరు మేస్త్రీలు మృతిచెందిన విషయం విదితమే. ఈ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. రెస్క్యూ సిబ్బంది రెండు రోజులపాటు నిర్విరామంగా శ్రమించి శిథిలాలను తొలగించారు. 27న తెల్లవారుజామున కామేశ్వరరావు అనే మేస్త్రీని కొన ఊపిరితో బయటకు తీయగా.. చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మృతిచెందాడు. 28న ఉపేందర్ అనే మరో మేస్త్రీ మృతదేహాన్ని సహాయక సిబ్బందికి వెలికి తీశారు. కాగా.. అనుమతులు లేకుండా ఏకంగా ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టడం, ఇద్దరి మృతికి కారణం కావడం వంటి అంశాల నేపథ్యంలో భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన భద్రాచలం పోలీసులు.. అతడిని కోర్టులో హాజరపర్చారు. దీంతో నిందితుడికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

## అత్తామామలను కత్తితో పొడిచిన అల్లుడు

గాయపడిన అత్తమామలు

అశ్వాపురం, మార్చి 30: అత్తామామలను అల్లుడు కత్తితో పొడిచి గాయపరిచిన ఘటన మండల కేంద్రంలోని హెవీ వాటర్ ప్లాంట్ కాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హెవీవాటర్ ప్లాంట్ కాలనీలో నివాసం ఉంటున్న కణితి నరసింహులు – వనజాక్షి దంపతుల వద్దకు అల్లుడైన శ్రవణ్‌కుమార్ తన భార్య ప్రవంతిని కాపురానికి తీసుకొని వెళ్లడానికి వచ్చాడు. రెండేళ్లుగా తల్లిదండ్రుల వద్ద ఉంటున్న ప్రవంతితో మాట్లాడి తనతో తీసుకెళ్లేందుకు ఒప్పించే క్రమంలో అత్తామామలతో మాటమాటా పెరిగింది. ఈ క్రమంలో క్షణికావేశంలో మామ నరసింహులు, అత్త వనజాక్షిని అల్లుడు కత్తితో గాయపరిచాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అశోక్‌రెడ్డి.. అల్లుడు శ్రవణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నం

అశ్వారావుపేట, మార్చి 30: మానసిక దివ్యాంగురాలిపై ఒకడు లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఆసుపాక గ్రామంలో ఓ మానసిక దివ్యాంగురాలు, ఆమె తల్లి కలిసి ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆ మానసిక దివ్యాంగురాలిపై, అదే గ్రామానికి చెందిన వెంకటేష్ లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు పరుగు పరుగున వచ్చారు. అప్పటికే వెంకటేష్ పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో వెంకటేష్‌పై కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో ప్రమాదంలో యువకుడు మృతి

పాల్వంచ రూరల్, మార్చి 30: డివైడర్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ముత్తోజు తిరుమలాచారి(33) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తగూడెం కూలీ లైన్‌కు చెందిన స్నేహితులు ముత్తోజు తిరుమలాచారి, ఆంథోని, శ్రీకాంత్ కలిసి ఈ నెల 29న ఆటోలో భద్రాచలం వెళ్లి, రాత్రి వేళ తిరుగు ప్రయాణమయ్యారు. ఆటోను ఆంథోని నడుపుతున్నాడు. మిగతా ఇద్దరు వెనుక కూర్చున్నారు. మండలంలోని జగన్నాథపురం వద్ద ఈ ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. తిరుమలాచారికి తీవ్రంగా, మిగతా ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని 108 సిబ్బంది కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తిరుమలాచారి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడు అక్కడే ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఇతడి బాబాయి నాగరాజు ఫిర్యాదుతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరుపుతున్నారు.

## మొక్కజొన్న కుంకులు తిని యువరైతు మృతి

జూలూరుపాడు, మార్చి 30 : మొక్కజొన్న కంకులు తిని అస్వస్థతకు గురై యువరైతు మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వినోభానగర్‌కు చెందిన జరుపల కృష్ణ(30) తన ఐదెకరాల భూమిలో ఓ కంపెనీకి చెందిన మేల్, ఫిమేల్ మొక్కజొన్న సాగు చేపట్టాడు. మొక్కజొన్న కంకులు విరిసేందుకు సిద్ధంగా ఉండటంతో గత వారంరోజులుగా పొలం వద్ద కాపలా కోసం వెళ్తున్నాడు. ఆ సమయంలో చేను వద్ద రోజూ కంకులు కాల్చుకొని తింటున్నాడు. దీంతో రెండ్రోజులుగా కాళ్లు లాగడం ఒళ్లంతా నీరసించిపోవడం లాంటి సంకేతాలు కనిపిస్తున్నాయని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మేల్, ఫిమేల్ మొక్కజొన్న కంకులు తినడం వల్లే ఇలా జరుగుతుందని తెలియక కంకులు తినడం ఆపలేదు. దీంతో ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైతు మృతదేహంపై పడి కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆ గ్రామానికి వెళ్లి రైతు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

## భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

గుండాల, మార్చి 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని మామకన్ను ఆశ్రమ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వంటమనిషి శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మృతిచెందాడు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని కాచనపల్లి గ్రామానికి చెందిన పూనెం సతీశ్(35) మామకన్ను ఆశ్రమ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి సమయంలో తను ఉండే గది భవనం పైకి ఎక్కగా అక్కడి నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. వెంటనే 108 వాహనం ద్వారా గుండాల ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే సతీష్ తరచుగా మద్యం బాగా సేవిస్తూ ఉంటాడని హాస్టల్ వార్డెన్ తెలిపారు.

## ఆరు పూరిండ్లు దగ్ధం

అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన ఇల్లు

పర్ణశాల, మార్చి 30: పర్ణశాల పంచాయతీ పిరాయిగూడెం గ్రామంలో ఆదివారం నాలుగు పూరిండ్లు పూర్తిగా, మరో రెండు పాక్షికంగా దగ్ధమయ్యాయి. పిరాయిగూడెం గ్రామస్తులు బొర్రా పాండు రాజు, సోందే వెంకటి, సోందే నాగేశ్వరరావు, వాగే లక్ష్మి.. తమ కుటుంబీకులతో కలిసి ఆదివారం కూలీ పనులకు వెళ్లారు. వారి ఇండ్లలోంచి మంటలు రావడాన్ని స్థానికులు గమనించారు. ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అంతలోనే ఆ పక్కనే ఉన్న కారం సోమమ్మ, వాగే లక్ష్మయ్య పూరిండ్లకు కూడా మంటలు అంటుకున్నాయి. పాండురాజు, వెంకటి, నాగేశ్వరరావు, లక్ష్మి ఇండ్లు పూర్తిగా; సోమమ్మ, లక్ష్మయ్య ఇండ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. బాధితులంతా సర్వస్వం కోల్పోయి, కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధితులు, స్థానికులు భావిస్తున్నారు. దగ్ధమైన ఇళ్లను రెవెన్యూ అధికారులు, భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ పరిశీలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# 'విశ్వావసు' సంతోషమస్తు

ఖమ్మం: వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు, ఉగాది వేడుకల్లో నాయకులు, కార్యకర్తలతో రేగా కాంతారావు, పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

'విశ్వావసు' నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సంతోషాల 'విశ్వావసు' సంవత్సరం కావాలని భగవంతుణ్ని ప్రార్థించారు. ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు ఉగాది పండుగకు ప్రత్యేకమైన ఉగాది పచ్చడిని, తీర్థొక్క ప్రసాదాలను తయారు చేసి భక్తులకు అందజేశారు. ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ పేరు, రాశి, జన్మన క్షత్రం ఆధారంగా నూతన సంవత్సరంలో భవిష్యత్తు ఫలాలను పురోహితులను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకొని తన్మయత్వం పొందారు.

- జిల్లాలో ఘనంగా 'ఉగాది' పర్వదినం
- అన్ని ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- ప్రత్యేక పూజలు చేసిన జిల్లా ప్రముఖులు

**ప్రముఖుల పూజలు..**

ఉగాది పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దేవదేవుణ్ని దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే, తమ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఆయురారోగ్యాలతో ప్రజా జీవితంలో నిండూ నూరేళ్లు విలసిల్లాలని వేడుకున్నారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మణుగూరులోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, అశ్వారావుపేట మండలం వినాయకపురం ముత్యాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

**- నమస్తే నెట్‌వర్క్**

అశ్వారావుపేట రూరల్: పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి, భద్రాచలం: పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, చుంచుపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

## సింగరేణిలో డంపర్ బోల్తా

మణుగూరు టౌన్, మార్చి 30: సింగరేణి మణుగూరు ఏరియాలో ఆదివారం మార్నింగ్ షిఫ్ట్‌లో ఓ భారీ వాల్వ్(డంపర్) అదుపుతప్పి బోల్తా పడింది. ప్రాణపాయం తప్పింది. దీనిపై సింగరేణి యాజమాన్యం అధికారికంగా స్పందించలేదు. వారం కిందట కూడా ఇదే ప్రదేశంలో ట్యాంకర్ బోల్తా పడింది.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

కరకగూడెం, మార్చి 30: మండలంలోని కౌలురు అటవీ ప్రాంత సమీపంలో గుడుంబా స్థావరాలపై ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సుమారు 3 వేల లీటర్ల గుడుంబాను పారబోశారు. గుడుంబా తయారీ సామగ్రిని, పాత్రలను స్వాధీనపర్చుకున్నారు.

## వంతెన పరిశీలన

జూలూరుపాడు, మార్చి 30:మండలంలోని బేతాళపాడు గ్రామ సమీపంలో పెద్దవాగు వంతెనపై నుంచి టాటా ఏస్ ట్రాలీ వాహనం ఇటీవల బోల్తాపడింది. ఈ వంతెనను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాలీ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను వారి ఇళ్ల వద్ద పరామర్శించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 50మంది మావోయిస్టుల లొంగుబాటు

**14 మందిపై రూ.68 లక్షల రివార్డు**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 30 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున మావోయిస్టులు బీజాపూర్ పోలీస్ అధికారులు, సీఆర్‌ఫీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో హార్డ్‌కోర్ మావోయిస్టులు సైతం ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రయాదవ్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో పోలీసులు నిర్వహిస్తున్న 'నియద్ నెల్లనార్' కార్యక్రమానికి ఆకర్షితులైన మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న వరుస ఆపరేషన్లతో ఆందోళన చెందుతున్న మావోయిస్టులు, తమ పార్టీ సిద్ధాంతాలపై సైతం అసంతృప్తికి లోనై ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బీజాపూర్ జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నాయకులతో సహా 50మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. లొంగిపోయిన ఆరుగురిలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు, ముగ్గురిలో ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు, ఐదుగురిలో ఒకొక్కరిపై రూ.లక్ష రివార్డుతో కలిపి మొత్తం రూ.68 లక్షల రివార్డులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో హిడ్మాకు అనుసంధానంగా ఉన్న బెటాలియన్లకు చెందిన మావోయిస్టులు సైతం ఉన్నారు. వీరంతా గతంలో అనేక విధ్వంసకర ఘటనలతోపాటు అనేక నేర సంఘటనల్లో పాల్గొన్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఇదిలాఉండగా లొంగిపోయిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా మావోయిస్టులు సైతం ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కేంద్ర హోంశాఖా మంత్రి అమిషా 'ఎక్స్' వేదికగా ఆహ్వానించారు. 2026 మార్చి 31నాటికి మావోయిజాన్ని రూపుమాపడమే తమ లక్ష్యమని, లొంగిపోయి అభివృద్ధికి సహకరించే మావోయిస్టులకు పునరావాసం తప్పక కల్పిస్తామని దేశ ప్రధాని నరేంద్ర పాలసీ అని పేర్కొన్నారు. సుక్మా జిల్లాలో శనివారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ అనంతరం పెద్దఎత్తున మావోయిస్టులు లొంగిపోవడం విశేషం.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

# గిరిజన మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

**ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్**

భద్రాచలం, మార్చి 30: ట్రైకార్ ద్వారా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని మహిళలు స్వయం శక్తితో ఎదగాలని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఆదివారం భద్రాచలంలో శ్రీలక్ష్మీ గణపతి న్యూట్రిమిక్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి వారు తయారు చేస్తున్న న్యూట్రిమిక్స్ పదార్థాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో మార్కెటింగ్ సరిగా లేక మూతపడిన సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలను ఆర్థికంగా వెసులుబాటు కల్పించి తిరిగి ఐటీడీఏ ద్వారా ప్రారంభించడం మంచి పరిణామం అన్నారు. ఐటీడీఏ ఆవరణలోని గిరిజన మ్యూజియంను సందర్శించారు. దమ్మక్క జాయింట్ లియోబిలిటీ గ్రూపు మహిళలకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, జీఎం లక్ష్మీప్రసాద్, ఎస్‌వో భాస్కర్ పాల్గొన్నారు.

భద్రాచలం: స్వయం శక్తి మహిళలతో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

బూర్గంపహాడ్: ఎగ్ ట్రేస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ట్రైకార్ చైర్మన్

**రామయ్యను దర్శించుకున్న ట్రైకార్ చైర్మన్**

భద్రాచలం, మార్చి 30: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట భద్రాచలం ఐటీడీఏ పీవో బీ.రాహుల్, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికంగా ఎదిగేలా జీవనోపాధి కల్పిస్తున్నాం**

బూర్గంపహాడ్, మార్చి 30: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ప్రతి కుటంబం ఆర్థికంగా ఎదిగేలా జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ ఎగ్ ట్రేస్ యూనిట్‌ను ఆయన ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువత ప్రవేశపెడుతున్న సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకోవడానికి ట్రైకార్ ద్వారా 60 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. చదువుకొని ఖాళీగా ఉన్న యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.1360 కోట్లతో రాజీవ్ యువశక్తి పథకం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ జీఎం శంకరావు, మేనేజరు లక్ష్మీప్రసాద్, ఏవో సున్నం రాంబాబు పాల్గొన్నారు.

## శాశ్వత మార్కెట్ యార్డ్‌గా మార్చాలని వినతి

మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

జూలూరుపా డు, మార్చి 30: దమ్మపేట మం డలం గండుగులపల్లిలో రాష్ట్ర వ్య వసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగృహంలో ఆదివారం గిరిజన సంఘాల నాయకులు కలిశారు. ఏన్కూరు మార్కెట్ యార్డ్‌కు అనుసంధానంగా కొనసాగుతున్న ఉప మార్కెట్ యార్డ్‌కు నిధులు కేటాయించాలని, దానిని శాశ్వత మార్కెట్ యార్డ్‌గా మార్చాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ధర్మా, కేశవ్ నాయక్, నాగేశ్వరరావు, మధు, భూక్యా శివ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

బానోత్ హరిప్రియ

ఇల్లెందు, మార్చి 30: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ రంజాన్ శుభాకాంక్షలు. రంజాన్ నెలలో 30రోజులు ముస్లింలు కఠోర ఉపాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారని ఆమె గుర్తుచేశారు. సోమవారం జరిగే ఈద్– ఉల్–ఫితర్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని, పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని కోరారు.

## ఈద్గా ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు, మార్చి 30: పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఈద్గా వద్ద సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా చదివే నమాజ్ ఏర్పాట్లను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని, పండుగను సంతోషంగా అందరూ జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సూర్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ, కూరగాయల మార్కెట్ వ్యాపారి జానీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## సహజ పానీయాలపై అవగాహన

పోస్టర్ ఆవిష్కరించిన జేవీవీ బాధ్యులు

చుంచుపల్లి, మార్చి 30: 'కోలా డ్రింక్స్ మానేద్దాం.. సహజ పానీయాలే తాగుదాం' పేరుతో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) బాధ్యులు ఆదివారం చుంచుపల్లి వాసులకు అవగాహన కల్పించారు. కరపత్రం ఆవిష్కరించి పంపిణీ చేశారు. విద్యానగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు కె.వీరభద్రం, ఎం.మోహన్ రావు, తిరుపాలు, సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు కామేశ్వరరావు, ధర్మారావు, సీతారామశాస్త్రి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు కారకులను శిక్షించాలి

ప్రార్థనాలు చేస్తున్న పాస్టర్లు రాజురాంచందర్, బోయాజ్

టేకులపల్లి, మార్చి 30: ఇటీవల హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మండల పాస్టర్ ఫెలోషిప్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ జీ.రాజురాంచందర్ డిమాండ్ చేశారు. ఆదివారం టేకులపల్లిలోని పెంతెకోస్తు ప్రార్థన మందిరంలో ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు. ప్రవీణ్ కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ టీ.బోయాజ్, కనకరాజు, చంద్రయ్య, కోటేశ్, నరేశ్, కృష్ణ, జెర్మియా, విష్ణు, యువరాజ్, హర్ష, సోని, అరుణ, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం: రేగా

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రేగా కాంతారావు

అశ్వాపురం, మార్చి 30: క్రీడలు.. శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. మండలంలోని గొందిగూడెంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తాటి రామయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన.. ఇరు జట్ల క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా చెడు వ్యసనాలను దూరం చేసుకుని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కోడి అమరేందర్, కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపిరెడ్డి, కర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, నూకారపు రమేశ్, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, నక్కబోయిన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రామోత్సవం

భద్రాచలం, మార్చి 30: భద్రాచలంలోని ఏఎస్ఆర్ కాలనీలో ఆదివారం ఉగాది సందర్భంగా విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రామోత్సవంలో భాగంగా భక్తులకు ధ్వజాల వితరణ చేశారు. కార్యక్రమంలో అవులూరి శ్రీనివాసరెడ్డి, ఏకే నాయుడు, దుర్గ గణేశ్, ప్రశాంత్, శేషు కర్ణ పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు తోఫా పంపిణీ

పాల్వంచ: తోఫా పంపిణీ చేస్తున్న సాబిర్‌పాషా, టేకులపల్లి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

పాల్వంచ, మార్చి 30: రంజాన్ సందర్భంగా పట్టణంలోని పేద ముస్లింలకు టీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, ఖాజీమ్ ఆలీ సహకారంతో తోఫాను సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా ఆదివారం పంపిణీ చేశారు. నాయకులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, అస్లాం, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం అర్బన్..**

కొత్తగూడెం అర్బన్, మార్చి 30: పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబానికి తోఫాను ఫ్రెండ్స్ ఫౌండేషన్ బాధ్యులు ఆదివారం అందించారు. వారికి ఆ కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

## టేకులపల్లిలో 